క్లుప్తంగా

'వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి'

జనగామ: లోక్‌సభలో ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ముస్లింలను ఆ భూములను పంచాలన్నారు. బిల్లును ఆపని పక్షంలో పోరాటం చేస్తామన్నారు.

సీఐకి సన్మానం



జనగామ: జనగామ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌రెడ్డిని జిల్లా కురుమ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కురుమ సంఘం జిల్లా కార్యదర్శి జాయ మల్లేష్, ఉపాధ్యక్షులు, లీగల్ అడ్వకేట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్ధిరాములు, బోరెల్లి సిద్ధులు, బాల్లె శ్రీశైలం, దేవర సత్తయ్య, నోము ల రాజు, పిక్క బీరప్ప, పర్వతాలు, గవ్వల సతీష్, కిరణ్, రాజు, ప్రసాద్, నోముల హరీష్ ఉన్నారు.

ఎస్సైకి..

చిల్పూరు: పద్మశాలి సంఘం నాయకులు స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జ్, జాతీయ ఐక్య వేదిక ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్, జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింద కృష్ణమూర్తిలు సన్మానించారు. కార్యక్రమంలో బండారి రాజ్‌కుమార్, శ్రీధర్, పేరాల కుమారస్వామి, నాగభూషణం పాల్గొన్నారు.

పాలకుర్తిలో దయాకర్‌రావుకు..

పాలకుర్తి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును శనివారం మేకల తండా, దుబ్బ తండా, విష్ణుపురి గ్రామాల ప్రజలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దయాకర్‌రావును సన్మానించారు.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న భక్తులు



కాలినడకన కొండపైకి చేరుకుంటున్న భక్తులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని పడమర కొండపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామిని శనివారం భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు గుట్టపై చేపట్టారు. కాగా, స్వామి వారికి ఇష్టమైన రోజు శనివారం కావడంతో భక్తులు దర్శించుకున్నారు.

అన్నదానం సద్వినియోగం చేసుకోవాలి

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు అన్నదానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్యలు కోరారు. కొండపైకి వచ్చే భక్తుల కోసం వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు చిట్టిమళ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా వారు ప్రారంభించారు. రమేష్, శ్రవణ్‌కుమార్, సోమన్న, హరిశంకర్, పూర్ణచందర్, సీతారాములు, రామయ్య, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ



దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లిలో ఫర్టిలైజర్ షాపులో దొంగతనం జరిగినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని సింగరాజుపల్లిలో జనగామ–సూర్యాపేట రహదారిలోని చౌరస్తా సమీపంలో శ్రీమల్లికార్జున ఎరువుల దుకాణంలో శుక్రవారం రాత్రి దొంగలు పడి రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. వారు చేసిన దొంగతనం బయటపడకుండా దుకాణంలో ఉన్న సీసీ కెమెరా రూటర్లను సైతం తీసుకెళ్లారు. దీంతో సదరు యజమానికి రూ.40 వేల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుడు చిర్ర రాజు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్‌తో పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పండ్ల పంపిణీ

లింగాలఘణపురం: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సింగపురం ఇందిర భర్త అమృతం జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు పోరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమృతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు బూడిద సదానందం, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల నర్సయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా ఇప్పగూడెం రోడ్లు

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- మొరం తరలిస్తున్న లారీలతో రోడ్లు ధ్వంసం



రోడ్డుపై నిలిచిన డ్రెయినేజీ నీరు



పైపులైన్‌కు మరమ్మతు చేయిస్తున్న కారోబార్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ప్రధాన రోడ్లు ధ్వంసమై అధ్వానంగా మారాయి. ఇప్పగూడెం నుంచి అక్కపెల్లిగూడెం, కుర్చపల్లి తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో గతంలో వేసిన బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా గ్రామ శివారులోని ఏనె నుంచి ఇష్టారాజ్యంగా మొరం మట్టిని తరలిస్తున్న భారీ టిప్పర్ వాహనాలతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, ఓవర్‌లోడ్‌తో మొరంమట్టి వాహనాలు రాత్రి, పగలు నడుస్తుండగా రోడ్లు దెబ్బతినడమే కాకుండా రోడ్డు లోపల ఉన్న తాగునీటి పైపులైన్‌లు ధ్వంసమవుతున్నాయి. ఇటీవల పైపులైన్‌లు పగిలిపోవడంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తేలిక పాటి వర్షానికే రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. మొరం మట్టిని తరలించే భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని గతంలో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై, ఇళ్ల ముందు నిలుస్తోంది. మురుగునీటిలో పందులు, దోమలు స్వైర విహారం చేస్తుండగా పారిశుధ్య సమస్య తీవ్రంగా మారింది. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలుతుండగా సంబంధిత అధికారులకు పారిశుద్య సమస్య పట్టడం లేదు. అధికారులు ఇప్పగూడెం సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లు ధ్వంసమవుతున్నా పట్టించుకోరా..



గ్రామంలో రోడ్లు ధ్వంసమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామశివారులోని ఏనె నుంచి ఇష్టారాజ్యంగా భారీ వాహనాల్లో మొరంను తరలిస్తున్నారు. భారీ వాహనాల కారణంగానే రోడ్లు దెబ్బతింటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మునిగెల రమేష్, సీపీఎం మండల కార్యదర్శి

సమస్యను వెంటనే పరిష్కరించాలి



మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఇప్పగూడెం గ్రామంలో రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. టిప్పర్ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అదేవిధంగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లు, డ్రెయినేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– దామెర వేణు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఆరోపణలను పట్టించుకోను
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: ఎమ్మెల్యేగా అన్ని గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని, ఒక గ్రామంపై కోపం, మరో గ్రామంపై ప్రేమ అనేది తనకు లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఆయన ముందుగా దుర్గామాతను దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని దుర్గామాతను దర్శించుకునేందుకు కొండా దంపతులు వస్తామంటే తాను అడ్డుకుంటున్నట్లు ఓ నాయకుడు చేసిన ఆరోపణలను తాను పట్టించుకోనన్నారు. దేవాలయాల సందర్శనకు మంత్రులు ఎక్కడికైనా వెళ్లవచ్చని అలాంటప్పుడు శ్రీపతిపల్లి గ్రామానికి వచ్చే మంత్రి కొండా సురేఖ, మురళిలను ఎందుకు అడ్డుకుంటానని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, మామిడాల యాదవరెడ్డి, గొంగిడి కృష్ణమూర్తి, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే గ్రామానికి రావొద్దు

మండలంలోని శ్రీపతిపల్లిలో దుర్గామాత ఆలయానికి మంత్రి కొండా సురేఖ దంపతులను రాకుండా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే శ్రీహరి గ్రామంలోకి రావొద్దంటూ బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఆలయ సమీపంలోని రోడ్డుపై శనివారం బైఠాయించాడు. కాగా, ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

'తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు'

చిల్పూరు: సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేస్తే అడ్మిన్‌తో పాటు గ్రూపుల్లో ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవని ఎస్సై నవీన్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల వాట్సప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే విధంగా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవన్నారు. శ్రీపతిపల్లిలో ఎమ్మెల్యే శ్రీహరి బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తే అడ్డుకోవడంతో పాటు వాట్సప్ గ్రూపులో రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేసిన కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్, పంగ సురేష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టు యోగి, కూతురుకు కన్నీటి వీడ్కోలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న తల్లి కృష్ణవేణి

జనగామ: హనుమకొండలో శుక్రవారం జర్నలిస్టు యుగంధర్‌రెడ్డి అలియాస్ యోగి అతని కూతురు ఆద్యతో కలిసి ఆత్మహత్య చేసుకోగా, శనివారం జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు జరిగాయి. ఎంపీ కడియం కావ్య, టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్ లెనిన్, గాడిపెల్లి మధు, కొండల్‌రావు, ఇర్రి మల్లారెడ్డి, సురిగెల భిక్షపతి, ఓరుగంటి సంతోష్, పార్నంది వెంకటస్వామి, వెంకటరత్నం, ఎల్లారెడ్డి, రమేశ్ తదితరులు తండ్రీ కూతుళ్లకు నివాళులర్పించి, వారికి ఆత్మశాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు. విగత జీవులుగా ఉన్న తండ్రీ, కూతురును చూసి జర్నలిస్టులు, పట్టణంలోని పలువురు స్నేహితులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇద్దరికి యోగి తల్లి దహన సంస్కారాలను నిర్వహించారు.

యోగి, ఆద్యరెడ్డిల మృతితో అలుముకున్న విషాదం

దేవరుప్పుల: మండల కేంద్రంలో పుట్టిపెరిగి ఉన్నత విద్యనభ్యసించి సమాజ హితం కోసం జర్నలిజం వృత్తిలో రాణిస్తున్న యోగిరెడ్డి తన కూతురు ఆద్యరెడ్డితో కలిసి ఆత్మహత్య చేసుకోగా గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. చిన్ననాటి నుంచి ఇక్కడ ఉన్న తరుణంలో బాల్యమిత్రులు, బంధువులు, పలు వర్గాల ప్రజలు జనగామలో జరిగిన అంత్యక్రియలకు పెద్దఎత్తున వెళ్లి అశ్రునివాళులర్పించారు. యోగిరెడ్డి మృతి జీర్ణించుకోలేకపోతున్నట్లు స్థానిక పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు.

నివాళి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో జర్నలిస్టు యోగిరెడ్డి, కూతురు ఆద్యరెడ్డిలకు జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

ప్రతీ రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

నర్మెట: పట్టాదారు పాసుపుస్తకం కలిగిఉన్న ప్రతీరైతుకు ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ తలపెట్టిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్దండలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెడుతూ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం పార్టీ రాష్ట్ర కమిటీ సెల్ నంబర్ 990411911ను ఏర్పాటు చేసిందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్, శివరాజ్ యాదవ్, సొడ రమేష్, సాక్యం అనిల్, జంగ నర్సింహారెడ్డి, శాతెల్లి రాజు, సానబోయిన మహిపాల్, శ్రీనివాస్, బొల్లం అవినాష్, బుచ్చాల కొంరెళ్ళి, రంగు మురళి, మోహన్ బాషా పాతూరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా బస్తాలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ గోదాంలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేటలో 60 టన్నుల 1,332 యూరియా బస్తాలు, కొన్నె గ్రామంలో 20 టన్నుల 444 బస్తాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా కావలసిన రైతులు నేడు (సోమవారం) ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో సొసైటీ వద్దకు రావాలని సూచించారు. రైతులకు సేవలను అందించడే సొసైటీ లక్ష్యమన్నారు. సీఈఓ కాశ బాలస్వామి, సిబ్బంది నరేందర్‌రెడ్డి, నరేష్, ఐలయ్య పాల్గొన్నారు.

పోరాటయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి



దేవరుప్పుల: పాపిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరుప్పుల: దేశంతోపాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం పోరాటం చేసిన యోధులను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ తలపెట్టిన హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం సమావేశం అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు మర్రిపాపిరెడ్డి స్మారక విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. పోరాటయోధులను స్మరించుకునేందుకు ప్రతీ ఇంటిపై మన జాతీయ జెండాను ఎగురవేసి రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దుబ్బ రాజశేఖర్ గౌడ్, దొంగరి మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్, జిల్లా సీనియర్ నాయకులు పెద్దగొని రాజు, మండల ఉపాధ్యక్షుడు గణేష్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి సంగి రాజు, మండల నాయకులు భాస్కర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అన్వేష్, భిక్షపతి, రమేష్, పాషా పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలి

కొడకండ్ల: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురేసి హర్‌ఘర్ తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన తిరంగా యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులు కోటేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, వెంకన్న, మహేష్, పరమేష్, రామకృష్ణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: ప్రతి గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ అన్నారు. పాలకుర్తిలో పార్టీ మండల అధ్యక్షుడు దంపలి సంపత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచినీల్ల ఉపేందర్‌రెడ్డి, మారం రవి, పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, పబ్బ సంతోష్, బోనగిరి శ్రీను, ఈర్ల రాజు, గుగ్గిల సురేష్, ప్రతాప్, మామిండ్ల వెంకన్నచ లకావత్ రవి, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



దేవరుప్పుల: విద్యార్థి దశలోనే తమలోని ప్రతిభను వెలికితీసేందుకు విద్యతోపాటు క్రీడాసాంస్కృతిక రంగాల్లో రాణించాలని కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో స్పోర్ట్‌మీట్‌లో భాగంగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా క్రీడలకు ప్రాముఖ్యతను ఇస్తే శారీరక, మానసిక ఉల్లాసంతోపాటు నాయకత్వపు లక్షణాలు వస్తాయన్నారు. తొలుత సీనియర్ విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎల్లోహౌజ్ టీమ్ విజయం సాధించింది. క్రికెట్‌తోపాటు వాలీబాల్, ఖోఖో, డిస్కస్‌త్రో, షటిల్ తదితర విభాగాల్లో ఆసక్తి కలిగిన ప్రతి విద్యార్థి భాగస్వామ్యమవుతూ తమ ప్రతిభ ప్రదర్శించాలని సూచించారు. పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మాధవి, అనిత, మహేష్,పాషా, మహేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకూ ప్రజాసేవలో ఉంటా : ఎర్రబెల్లి



మాట్లాడుతున్న దయాకర్‌రావు

కొడకండ్ల: ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవకు పాటు పడుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదు కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సింధె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో గారడి చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీలతో ఫెయిల్యూర్ ప్రభుత్వంగా మిగిలిపోయిందన్నారు. సోషల్ మీడియాలో పార్టీ మారుతున్నట్లు తనపై వస్తున్న పుకార్లను నమ్మొద్దని, కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఏడునూతుల, రేగులతండలో బాధిత కుటుంబాలను ఎర్రబెల్లి పరామర్శించారు. మాజీ మార్కెట్ చైర్మన్ రాము, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కొన్నె గ్రామానికి చెందిన మల్ల వరుణ్ చదువుకు సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల సాయం శనివారం అందజేశారు. మల్ల సిద్దిరాములు, నర్సయ్య, భద్రయ్య, ఇమ్రాన్, బాలరాజు, రమేష్‌పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన నాయకులు

చిల్పూరు: బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను నాయకులు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. మాజీ మంత్రి గుండె విజయరామారావు, అంజిరెడ్డి, రమణగౌడ్, రాజుయాదవ్ తదితరులు ఉన్నారు.

సామూహిక సీమంతాలు

జనగామ రూరల్: కల్కి భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గర్భిణులకు శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని తహసీల్‌లో రేపు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నయాబ్ తహసీల్దార్ ఫణికిషోర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. భూసమస్యలు ఉన్న రైతులు ప్రజావాణిలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, ఏఆర్ఐ మునావర్, జూనియర్ అసిస్టెంట్ యాకయ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో అనారోగ్యాలతో మృతి చెందిన వారి కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలబోయిన నరేష్ తల్లి యాదమ్మ, గుర్రపు రాజయ్య, కొండాపూర్ గ్రామానికి చెందిన మోతె వెంకటమ్మ, చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన నాగపురి భాగ్యల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన సంపత్‌యాదవ్ అకాల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మృతుడి చిత్ర పటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో డాక్టర్లు అందించే వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రతీ నెల రెండో శనివారం ఆయుష్మాన్ ఆరోగ్య శిబిర్ (హెల్త్ మేళా) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హెల్త్ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. స్పెషలిస్టులతో హెల్త్ క్యాంపులో పిడియాట్రిక్ 33, డెంటల్ 29, డెర్మటాలజీ 27, జనరల్ 37 మందికి వైద్య పరీక్షలను చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సుప్రజ, దీప్తి, సిద్దిసుదర్శన్‌రెడ్డి, హెడ్ నర్సు రోహిణి, స్టాఫ్ నర్సు జ్యోతి, జయశ్రీ, ఫార్మసిస్టు బొడ్డు శ్రీను, శ్వేత, లలితతోపాటు పాల్గొన్నారు.

వయనాడ్ మృతుల ఆత్మశాంతికి కొవ్వొత్తులతో ర్యాలీ

చిల్పూరు: వయనాడ్ వరదల్లో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం పల్లగుట్ట గ్రామంలో బిషప్ ఉడుముల బాల ఆదేశాల మేరకు క్రీస్తురాజు దేవాలయం ఫాదర్ బాలశౌరి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జీడీ రమేష్, జాన్, అశోక్‌పాల్, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

దేవస్థాన చైర్మన్ పోటీలో పలువురు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వరాలయ కమిటీ చైర్మన్ పదవి కోసం పలువురు ఆశావహులు పోటీ పడుతున్నారు. పదేళ్ల కిత్రం మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన బావండ్ల కృష్ణంరాజు చైర్మన్‌గా పాలక మండలిని గత ప్రభుత్వం నియమించింది. కాగా, కమిటీ రద్దయిన తర్వాత మళ్లీ కమిటీని నియమించలేదు. ప్రస్తుతం కొత్త కమిటీని నియమించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో చైర్మన్ పదవి రేసులో మండల కేంద్రానికి చెందిన జిల్లా రాజేశ్వర్‌గుప్తా, కొన్నె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, రామచెంద్రాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆముదాల మల్లారెడ్డి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ గాలి కృష్ణ పోటీలో ఉన్నారు. త్వరలో నియమించే ఆలయ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరించేనో వేచిచూడాలి.

రోడ్డుకు మరమ్మతు పనులు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చే బీటీ రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న విషయాన్ని గుర్తించి గ్రామానికి చెందిన తాజా మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా దంపతులు సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మత్తు పనులను చేయించారు. ఈ మేరకు రూ.30వేల ఖర్చుతో శనివారం బీటీ రోడ్డుపై ఉన్న గుంతలను తాత్కాలికంగా పూడ్చివేసే పనులను చేపట్టారు.